పార్కింగ్ స్టాండ్‌లలో దారుణ దోపిడీ !

- విజయవాడ రైల్వేస్టేషన్ పార్కింగ్ స్టాండ్‌లలో అధికంగా వసూలు
- ధనార్జనే ధ్యేయంగా పార్కింగ్ నిర్వాహకులు
- అధ్వానంగా పార్కింగ్ నిర్వహణ
- ఎండ, వానకి పాడవుతున్న వాహనాలు



ప్రీమియం ద్విచక్ర వాహన పార్కింగ్‌లో ఎండలోనే పార్కింగ్ చేసిన వాహనాలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్‌లో ద్విచక్రవాహనాల పార్కింగ్ స్టాండ్‌లు దోపిడీకి నిలయాలుగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. కనీసం వాహనాల పర్యవేక్షణ సైతం పట్టించుకోక పోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాహనాలు ఎందుకూ పనికిరా కుండా పోయే స్థితికి వస్తున్నాయని పలువురు అం టున్నారు. రైల్వే అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణి కులు, ఉద్యోగుల వాహనాలకు రక్షణ కల్పించే దిశగా రైల్వే అధికారులు పార్కింగ్ స్టాండ్‌లను నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్‌లకు అప్పగిం చింది. ప్రయాణికుల నుంచి ప్రతి నెల రూ.లక్షల్లో ఆదాయం అందుకుంటున్న పార్కింగ్ నిర్వాహ కులు మాత్రం వారి వాహనాల రక్షణలో కనీసం చర్యలు తీసుకోకపోవడం పట్ల పలువురు వాహన దారులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీగా వసూళ్లు....

స్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం వద్ద, రైల్వే ఆసుపత్రి పక్కన ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించి వాటి నిర్వహణ బాధ్యతలను కాంట్రా క్టర్‌లకు అప్పగించింది. విజయవాడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రీమియం పార్కింగ్ స్టాండ్‌లో ప్రతి గంటకు రూ. 10, జీఎస్టీతో కలిసి రూ. 11.80 వసూలు చేస్తున్నారు. అదే విధంగా



రైల్వే ఆసుపత్రి పక్కన పార్కింగ్‌లో పైకప్పు చిరిగిపోవడంతో ఎండలోనే వాహనాలు



పార్కింగ్ ధరల పట్టిక

రైల్వే ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్టాం డ్‌లో ఒక్కో వాహనం నుం చి మూడు గంటలకు రూ. 10 పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారు. మూడు గంటలు దాటితే ప్రతి గంటకు అదనంగా మరో పది రూపాయాలు, జీఎస్టీతో స్లాబ్ రేటు నిర్ణయించి మరీ ప్రయాణి కుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. కొన్ని సమయాల్లో ఇతర ప్రాంతాలకు వేళ్లే ప్రయా ణికులు నాలుగు, ఐదు రోజులు పార్కింగ్ చేస్తే వారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుంది. దారుణం గా దోపిడీ చేస్తున్నారు.

ఎండకు ఎండి, వానకు తడవాల్సిందే...

గంట గంటకు స్లాబ్ రేటు నిర్ణయించి వాహనదా రుల నుంచి అధిక మొత్తం వసూళ్లకు పాల్పడు తున్న పార్కింగ్ నిర్వాహకులు ప్రయాణికుల వాహనాల సంరక్షణ మాత్రం గాలికొదిలేశారు. పార్కింగ్ ప్రదేశాల్లో రక్షణ గోడలు, ఎండ, వానకు వాహనాలు తడవకుండా షెడ్డులు నిర్మాణం చేయాల్సి ఉంది. కానీ నిర్వాహకులు అవేమీ పట్టిం చుకోకుండా కేవలం డబ్బులు వసూళ్లకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు కనీసం షెడ్డు నిర్మాణం కూడా చేయకుండా ఎం డలోనే పార్కింగ్ చేయిస్తున్నారు. అదే విధంగా రైల్వే ఆసుపత్రి పక్కన పార్కింగ్ ప్రదేశంలో అయితే తాత్కాలికంగా కర్టెన్‌లతో పైకప్పు ఏర్పాటు చేశారు. అదికాస్తా ఎండకు ఎండి చిరిగిపోయినా పట్టించుకోకుండా వాహనాలను పార్కింగ్ చేయిస్తు ఆదాయం ఆర్జిస్తున్నారు.

లోపించిన అధికారుల పర్యవేక్షణ...

ద్విచక్రవాహనదారుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు చేసుకుంటూ వారి వాహనాల సంరక్షణ పట్టించుకోని పార్కింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన రైల్వే కమర్షియల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిం చడంతోనే ఇటువంటి పరిస్థితి నెలకొంటుందని పలు వురు వాహనదారులు వాపోతున్నారు. ప్రయా ణికులు చెల్లించే డబ్బులకు కనీసం వారి వాహనా లకు రక్షణ కల్పించే దిశగా అధికారులు పర్యవేక్షిం చాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయ క్రీడలకు వెళ్లిన రాష్ట్ర బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు



జాతీయ క్రీడలకు పయనమైన రాష్ట్ర బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు

విజయవాడస్పోర్ట్స్: ఉత్తరాఖండ్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 38వ జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్ర ప్రదేశ్ బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు శుక్రవారం పయనమైనట్లు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సత్యనారాయ ణరాజు తెలిపారు. జట్టులో చోటు దక్కించు కున్న ఎస్.రాము(విశాఖపట్నం), ఎస్.అమీర్(విశాఖపట్నం), కె.శ్రీను(విశాఖపట్నం), ఎ.జగదీష్(కర్నూలు), కె.శివకుమార్(కర్నూ లు), ఆర్.రియాజ్(కర్నూలు), ఎం.స్వామి నాథన్(ప్రకాశం), కె.పవన్‌కల్యాణ్(చిత్తూరు), ఎల్.జనార్ధనరెడ్డి(గుంటూరు), ఇ.రాజు(అనం తపురం) విజయవాడ నుంచి బయలుదేరారు. ఈ బృందానికి ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసి యేషన్(ఏపీవోఏ) అధ్యక్షుడు ఆర్.కె.పురు షోత్తం ట్రాక్‌షూట్, కిట్లు, జెర్సీలు సమకూర్చా రని, అలాగే తమ సంఘం ప్రయాణ ఖర్చు లను సమకూర్చిందని సత్యనారాయణరాజు తెలిపారు. జట్టు బృందాన్ని కృష్ణాజిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వంశీకృష్ణ, కోచ్ గోపీకృష్ణ అభినందించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ శ్రీనగర్ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ లక్ష్మీన గర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సర ఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజినీర్ పీ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేపల్లి వారి వీధి, అడవి శేషగిరిరావు వీధి, జాగర్ల మూడి వారి వీధి, దండమూడి రామ్మోహన్ రావు వీధి, భగత్‌సింగ్ రోడ్డు తదితర ప్రాం తాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బం దికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

దోమల నియంత్రణకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగర పాలక సంస్థ మలేరియా విభాగం అధికారులు స్పం దించారు. 30వ డివిజన్‌లో చెరువులను తలపిస్తున్న ఖాళీస్థలాల్లో దోమల నియంత్రణ చర్యలు చేప ట్టారు. నగరంలో దోమలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. దీంతో స్థానికులు పడుతున్న అవ స్థలు వివరిస్తూ సాక్షి శుక్రవారం 'దోమలు బాబోయ్ దోమలు' శీర్షికన కథనం ప్రచురించిం ది. దీనిపై స్పందించిన అధికారులు మురుగునీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్, తాజా నీటి నిల్వల్లో గంబూసియా చేపలను వేశారు. ఈ సందర్భంగా నగరపాలకసంస్థ బయాలజిస్ట్ సూర్యనాయక్ మాట్లాడుతూ ఇక్కడ ఖాళీస్థ లాల వల్ల నీరు నిలిచిపోతున్నాయన్నారు. కావున ఖాళీస్థలాల యజమానులు మెరక చేయించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

యోనెక్స్ సన్‌రైజ్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేత షరిష్మ



విజయవాడ స్పోర్ట్స్: యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇం డియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో విజయ వాడ క్రీడాకారిణి తమిరి సూర్యష రిష్మ సత్తా చాటిం ది. బెంగుళూరులో ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొ న్నారు. సింగిల్స్ ఫైనల్స్‌లో మానసి సింగ్(ఉత్త రప్రదేశ్)ను షరిష్మ 21–18, 23–21(2–0) తేడాతో ఓడించి విన్నర్ ట్రోఫీని అందుకుంది. క్రీడాకారిణి షరిష్మ ఎనిమిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కోచ్ కె.భాస్కర్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. జాతీయ ట్రోఫీ సాధించిన షరిష్మకు ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ అభినందనలు తెలిపారు.

వాటర్ ట్యాంక్ ప్రహరీకి శంకుస్థాపన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్‌లో రూ. 17.49లక్ష లతో వాటర్ ట్యాంక్ ప్రహరీ పనులకు శుక్ర వారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేశామన్నారు. సాధ్యమైనం త త్వరలోనే వాటర్ ట్యాంక్ ప్రారంభించి కృష్ణా జలాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి, నాయకులు ఘంటా కృష్ణమోహన్, గరిమెళ్ల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో ఆదివారం జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాని విజయవాడ నగరపా లక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశే ఖర్ తెలిపారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షే త్రంలో జరిగే కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అలాగే బందరురో డ్డులో ఉన్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే గణతంత్ర వేడుకల ఏర్పా ట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం లోనూ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ అప్ర మత్తంగా ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బం ది కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. వేడుకలకు వచ్చే ప్రజలకు సక్రమంగా తాగు నీటి సరఫరా జరగాలని, మరుగుదొడ్లను ఎప్ప టికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించే వేడుకల్లో ఎటువంటి లోపం లేకుండా చూసు కోవాలని కోరారు.

భారతీ తీర్థ స్వామి జయంతి వేడుకలు ప్రారంభం



ఆదిశంకరులకు పూజాదికాలు నిర్వహిస్తున్న వేదపండితులు



నవచండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో శుక్ర వారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను 75 రోజులపాటు నిర్వహించనున్నారు. తొలుత వేద పండితులు జగద్గురు ఆదిశంకరుల విగ్రహాలకు పూజాదికాలు నిర్వహించారు. వేద పారాయణం, షోడశ పూజలు అత్యంత వైభవంగా నిర్వహిం చారు. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి మహాస్వామి ఆదేశంతో లోక సంరక్షార్థం నవచండీ హోమం, రుద్ర పారాయణం చేశారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లా డుతూ నవచండీ హోమం అత్యంత శక్తివంతమై నదని తెలిపారు. లోకమాత చండీదేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్ర మంలో భాగంగా అంబటిపూడి రాధేశ్యాం గణేష పురాణం అంశంగా ప్రసంగించారు.

తాండ్ర పాపారాయుడికి నివాళి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కార్యాలయం వద్ద శుక్రవారం తాండ్ర పాపారాయుడు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర పాపారా యుడు చిత్రపటానికి నివాళులర్పించారు. వెలమ సంక్షేమ సంఘం ఘంటా శ్రీనివాసరావు తాండ్ర పాపారాయుడు చరిత్రను వివరించారు. ఆయన చూపిన తెగువ భావితరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతరం పేదలకు ఆహార పొట్లాలు పం పిణీ చేశారు. వర్ధంతి కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సిరిపురపు కిరణ్‌కుమార్, కోశా ధికారి గంటా శ్రీనివాసరావు, సంఘం గౌరవ సల హాదారులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఉపాధ్యక్షులు, లీగల్ అడ్వైజర్లు పాల్గొన్నారు.



పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వెలమ సంఘం ప్రతినిధులు

హోల్ సేల్ మెడికల్ డీలర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆలిండియా అసోసియేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షుడు జగన్నాథ్ షిండే 75వ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం విజయవాడ నక్కల్ రోడ్డులోని యూనిటీ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ది కృ ష్ణా జిల్లా హోల్ సేల్ డ్రగ్గిస్ట్స్ అండ్ కెమిస్ట్స్ హోల్ సేల్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ శిబిరంలో పలువురు డీలర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సీసీ కేశవరావు, కార్యదర్శి పల్లపోతు మురళీకృష్ణ, కోశాధికారి గద్దె సురేష్ మాట్లాడుతూ జగన్నాథ్ షిం డే చేసిన సేవలను ప్రశంసించారు. జాతీయ స్థాయిలో డీలర్ల సమస్యల పరిష్కారానికి షిండే ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన పుట్టిన రోజు నాడు దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించినట్లు తెలిపారు. రక్తదాతలకు అభినందనలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ క్రీడల్లో సత్తా చాటండి

శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్స్: జాతీయ క్రీడల్లో సత్తా చాటాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సం స్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు రాష్ట్ర ఖోఖో జట్టుకు సూచించారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఉత్తరాఖండ్‌లో ప్రారంభమయ్యే 38వ జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును శాప్ కార్యాలయంలో చైర్మన్ రవి నాయుడు, ఎండీ గిరీషా శుక్రవారం అభినందిం చారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని వస తులను శాప్ సమకూర్చుతుందని, రాష్ట్రానికి పత కాలు సాధించేలా క్రీడాకారులు కష్టపడాలని చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో శాప్ ఏఓ ఆర్.వెం కటరమణ నాయక్, ఏపీ ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ఎం.సీతారా మరెడ్డి, జట్టు మేనేజర్ కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.



రాష్ట్ర ఖోఖో జట్టుతో రవినాయుడు

ఎస్‌బీ ఏసీపీగా కిరణ్‌కుమార్, సౌత్ ఏసీపీగా పవన్‌కుమార్



సీపీ రాజశేఖరబాబు మొక్కను అందజేస్తున్న ఎస్‌బీ ఏసీపీ కిరణ్‌కుమార్



సీపీ రాజశేఖరబాబుకు మొక్కను అందజేస్తున్న సౌత్ ఏసీపీ పవన్‌కుమార్

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఎస్.కిరణ్‌కుమార్, సౌత్ జోన్ ఏసీపీగా డి.పవన్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం పోలీస్ కమి షనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకం గా కలుసుకుని మొక్కను అందజేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఇరువురు అరెస్టు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురాన గర్ పప్పులమిల్లు సెంటర్‌లో గంజాయి విక్ర యించడానికి ప్రయత్నిస్తున్న ఇరువురిని గుణ దల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 250గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకు న్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు మధురానగర్ పప్పులమిల్లు సెం టర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమ యంలో ఇరువురు వ్యక్తులు నల్ల రంగు క్యారీబ్యా గ్‌తో అనుమానాస్పదంగా సంచరించడంతో పాటు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు సిబ్బంది సహాయంతో అదుపు లోకి తీసుకుని ప్రశ్నించారు. గంజాయి అమ్మేం దుకు ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. విచార ణలో నిందితులు లెనిన్‌నగర్‌కు చెందిన ఎస్. తరుణ్‌చౌదరి(25), మురళీనగర్‌కు చెందిన షేక్ ఫాతిమా(54)గా గుర్తించారు.

రేపు కబేళాకు సెలవు

పటమట(విజయవాడతూర్పు): జాతీయ గణ తంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నగ రంలో మాంసం, చేపలు విక్రయాలను నిషేధిం చినట్లు వీఎంసీ ప్రజారోగ్య విభాగం ప్రధాన అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. శని వారం రాత్రి నుంచే నగరంలో జంతు వధ నిషే ధించామని పేర్కొన్నారు. నగరంలోని కబేళాకు సెలవు ప్రకటించడంతోపాటు, చేపలు, మాంసం మార్కెట్లు, అన్ని చికెన్, మటన్ షాపులు వారి వ్యాపారాలను నిలుపుదల చేయాలని ఆదేశిం చారు. అనుమతి లేకుండా ఎవరైనా జీవాలను వధించినా, షాపులను ప్రారంభించినా, మాం సాహారాలు విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని మటన్, చికెన్, చేపలు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులందరూ ఆదివారం వ్యాపా రాలను బంద్ చేయాలని కోరారు.



జీవీఆర్‌నగర్ మెయిన్ రోడ్డులో మంచు



గుణదల రోడ్డులో..



మంచుతెరల్లో 30వ డివిజన్

కప్పుకున్న మంచు దుప్పటి

నగరాన్ని శుక్రవారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచుతెరలు వీడలేదు. దీంతో వాహన చోదకులు రాకపోక లకు ఇబ్బందులు పడ్డారు. బెజవాడలో ఇంత మంచు పడటంతో ప్రకృతి ప్రేమికులు పులకించి పోయారు. మధురానగర్, ముత్యాపపాడు, జీవీఆర్‌నగర్, వినాయకనగర్, దావు బుచ్చ య్యకాలనీ, గుణదల, అయోధ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు కొనసాగాయి.

–మధురానగర్(విజయవాడసెంట్రల్)

ఉత్సాహంగా రంగవల్లులు, క్రీడా పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపు రంలో శుక్రవారం ఇందిరా మహిళా మండలి ఆధ్వ ర్యాన గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని రం గవల్లులు, క్రీడా పోటీలు నిర్వహించారు. పెద్ద సం ఖ్యలో మహిళలు పోటీల్లో పాల్గొని వారిలోని సృజనా త్మకతను చాటేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. అలాగే లెమన్ స్పూన్ పోటీల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇం దిరా మహిళా మండలి అధ్యక్షురాలు కె. మాధవీలత మాట్లాడుతూ తాము ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మహిళలకు ఆటలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అం దజేస్తున్నట్లు తెలిపారు. 26వ తేదీన గణతంత్ర దినో త్సవ వేడుకల్లో ప్రముఖుల చేతులమీదుగా బహుమ తుల ప్రదానం జరుగుతుందని పేర్కొన్నారు. కార్య క్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.వి. రామా రావు తదితరులు పాల్గొన్నారు.



రంగవల్లుల పోటీల్లో మహిళలు

వేడుకగా సావిత్రి సినీ జీవిత వజ్రోత్సవం

విజయవాడ కల్చరల్: నడిచే నట గ్రంథాలయం మహానటి సావిత్రి అని సావిత్రి కళాపీఠం వ్యవస్థా పకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహా నటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీన గర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్ర వారం సినీ నటి సావిత్రి సినీ వజ్రోత్సవం, సినీ సం గీత విభావరి, మహానటి సావిత్రి జాతీయ స్మారక పురస్కారాల సభను నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి కళాపీఠం ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ కల్చరల్ చైర్‌ప ర్సన్ తేజస్వి మాట్లాడుతూ కళా సాంస్కృతిక ప్రదర్శ నలకు ప్రభుత్వం ద్వారా సహకరిస్తామని పేర్కొ న్నారు. సావిత్రి లక్షలాది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. నిర్వాహ కులు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృ ష్ణను, ఏపీ క్రియేటివ్ చైర్‌పర్సన్ చైర్మన్‌కు మహానటి సావిత్రి జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన కే డేవిడ్‌రాజు, బీవీ వీరభ ద్రరావు, ప్రసూనా రామన్, దామోదర గణపతిరావు పాల్గొన్నారు. సావిత్రి నటించిన చిత్రాల్లోని 40 పాటల పల్లవులను నగరానికి చెందిన పలువురు గాయకులు విష్ణుప్రియ, సుధాశ్రీనివాస్, కల్యాణి, ప్రజ్ఞ, సత్యవర్ధన్, రసూల్‌బాబు ఆలపించారు.



గుమ్మడి గోపాలకృష్ణ, తేజస్వికి సావిత్రి జాతీయ పురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు

విజయవాడస్పోర్ట్స్: కమిషనరేట్ కార్యాల యంలో శుక్రవారం 150 మంది అధికా రులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ ఎస్. వి.రాజశేఖరబాబు ప్రశంసా పత్రాలను అందజేశారు. రోడ్డు ప్రమాద బాధితు లకు(హిట్ అండ్ రన్ కేసుల్లో) జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి నష్టపరిహారం అనతి కాలంలోనే అందేలా చర్యలు తీసుకున్న, హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కలి ్పించిన, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి చలానా రుసుమును వసూలు చేసిన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ రాజశేఖరబాబు అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ట్రాఫిక్ ఏసీపీ పి.రామచంద్రరావు, నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ పాల్గొన్నారు.



గవర్నర్‌పేట సీఐ నాగమురళికి ప్రశంసా పత్రం అందజేస్తున్న సీపీ రాజశేఖరబాబు